ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 28 మార్చి 2024



ఉపాధి క్షేత్ర సహాయకుడి తొలగింపు

కలెక్టరేట్, మార్చి 27: మందస మండలం తల్లా గురుటి పంచాయతీకి చెందిన ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు(ఫీల్డ్ అసిస్టెంట్) నల్ల లోకనాథ చౌదరిని విధుల నుంచి తప్పించినట్టు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథక సంచాలకుడు జీవీ చిట్టిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో లోకనాథం పాల్గొంటున్నట్టు అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో భరత్ నాయక్ విచారణ చేపట్టారు. లోకనాథం ఎన్నికల ప్రచారం చేసినట్టు ధ్రువీకరించారు. దీంతో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద ఆయన్ను విధుల నుంచి తప్పించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బుజ్జగింపులు

- కలమట, గుండను కలిసిన టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్
- చంద్రబాబును కలవాలని సూచన
- మూడురోజుల్లో అధినేత వద్దకు



గుండ లక్ష్మీదేవితో మాట్లాడుతున్న టీడీపీ ఎన్నికల విభాగ జోనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

టీడీపీ టిక్కెట్లు దక్కని నాయకులను అధిష్ఠానం బుజ్జగిస్తోంది. ఈసారి టిక్కెట్లు ఆశించి రాకపోవడంతో అసంతృప్తిగా ఉన్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని చంద్రబాబు పిలిచారు. ఇటీవల చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వే, ప్రజాభిప్రాయ సేకరణ మేరకు శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థిగా గొండు శంకర్, పాతపట్నం అభ్యర్థిగా మామిడి గోవిందరావుకు టిక్కెట్లు లభించాయి. దీనిపై లక్ష్మీదేవి, వెంకటరమణ తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. తమను కాదని.. కనీసం ఫలానా వారికి టిక్కెట్ ఇస్తున్నామని కూడా చెప్పకుండా ఏకపక్షంగా టిక్కెట్ ఇచ్చేశారంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. దీంతో విషయం పెద్దదికాకుండా పరిష్కరించేందుకు అధినేత చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. టీడీపీ ఎన్నికల విభాగ జోనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డిని శ్రీకాకుళం జిల్లాకు బుధవారం పంపించారు. ముందుగా పాతపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. చంద్రబాబు వద్దకు ఫలానా రోజున రావాలని.. అన్ని సమస్యలు సర్దుకుంటాయని చెప్పారు. అలాగే మరికొన్ని విషయాలను వెల్లడించారు. కార్యకర్తల నుంచి అభిప్రాయాన్ని సేకరించారు. బుధవారం రాత్రి శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవిని కలిశారు. మూడురోజుల వ్యవధిలో చంద్రబాబు వద్దకు రావాలని కబురు అందించారు. అలాగే ఇక్కడ కూడా కార్యకర్తల నుంచి అభిప్రాయాన్ని సేకరించారు. తాను సేకరించిన విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ముఖ్య అనుచరులతో కలసి చంద్రబాబు వద్దకు వెళ్లాలని వెంకటరమణ, లక్ష్మీదేవికి సూచించారు. వారు కూడా అంగీకరించారు. శ్రీకాకుళంలో మాజీమంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, ప్రముఖవైద్యుడు దానేటి శ్రీధర్, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, టీడీపీ అధికారప్రతినిధి కృష్ణమూర్తినాయుడు, కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాన్ని ఎన్నికల జోనల్ కో ఆర్డినేటర్ వద్ద వెల్లడించారు. టిక్కెట్ విషయంలో తుదినిర్ణయం చంద్రబాబునాయుడుదేనని, కాకపోతే ఈ మొత్తం సమాచారాన్ని తాను అధినేతకు వివరిస్తామని హామీఇచ్చారు. రెండు రోజుల క్రితం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కూడా వీరిద్దరికీ నచ్చజెప్పేందుకు యత్నించారు కానీ.. ఆశించిన రీతిలో స్పందన లభించలేదు. దీంతో అధిష్ఠానమే రంగంలోకి దిగింది.

మళ్లీ ఫోన్‌కాల్స్..

ఇప్పటికే జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకు టీడీపీ కూటమి తరఫున అసెంబ్లీ అభ్యర్థులను, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి గాను అభ్యర్థిని ప్రకటించేశారు. అయితే, శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో మాత్రమే అసంతృప్తి జ్వాల రేగింది. దీంతో టీడీపీ అధిష్ఠానం తరఫున నిర్వహించే ఐవీఆర్ఎస్ ద్వారా ఈ రెండు నియోజకవర్గాల్లో మళ్లీ ముఖ్యకార్యకర్తలు, పార్టీలో క్రియాశీలకంగా ఉండేవారికి ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఈ ఫోన్‌కాల్స్‌లో వెంకటరమణ, లక్ష్మీదేవి పేర్లను ప్రస్తావిస్తున్నారు. అయితే అభ్యర్థులను ప్రకటించేసినప్పటికీ మళ్లీ ఐవీఆర్ఎస్ సర్వే జరపడం చర్చనీయాంశమైంది.

అనుమానాస్పద స్థితిలో ఆర్మీజవాన్ మృతి



జోగారావు(ఫైల్)

పలాసరూరల్, మార్చి 27: మండలంలోని మోదుగుల పుట్టి గ్రామానికి చెందిన మద్దిల జోగారావు(40)అనే ఆర్మీ జవాన్ జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్ యూనిట్‌లో జేసీవో క్యాడర్‌గా సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. జోగారావు మృతదేహానికి మిలటరీ అధికారులు పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు అధికారుల నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. జోగారావుకు భార్య హేమకుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అందరితో ఎంతో కలివిడిగా ఉండే జోగారావు మృతి చెందడంతో విషాదచాయలు అలముకున్నాయి. ఆయన మృతికి గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియరాలేదు.

కారులో తరలిస్తున్న నగదు స్వాధీనం



జి.సిగడాం: కారులో తరలిస్తున్న రూ.73వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉల్లివలస చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహన తనిఖీలు చేపట్టారు. ఆశపు వీరప్రకాషరావు అనే వ్యక్తి కారులో రాజాం నుంచి గరివిడి వెళ్తుండగా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. కారులో రూ.73 వేల నగదు పట్టుబడింది. దీనికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. వీరప్రకాషరావు గరివిడి బ్యాంకు ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నారు. ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడేళ్లుగా ఎదురుచూపు

- పాడిరైతు దరిచేరని వైఎస్ఆర్ పశు బీమా పరిహారం
- రూ.11.6కోట్ల బకాయిలు

(టెక్కలి)

టెక్కలి మండలం నర్సింగపల్లి ఆర్బీకే పరిధిలోని కొల్లివలస గ్రామానికి చెందిన బిల్లింగి మల్లేసు పాడి ఆవు 2021 ఏప్రిల్ 18న మృతి చెందింది. బీమా ఉండడంతో మల్లేసు పశుసంవర్ధకశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. దీంతో వారు హుటాహుటిన వచ్చి వివరాలు నమోదు చేశారు. అయితే మూడేళ్లు కావస్తున్నా పాడిరైతుకు నష్టపరిహారం ఇంకా అందలేదు. ఇలాంటి రైతులు జిల్లాలో చాలామంది ఉన్నారు. మూడేళ్లుగా పశు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. వైఎస్ఆర్ పశు నష్టపరిహారం కింద ఆవులు, గేదెలు మృతి చెందితే నాటు రకానికి చెందిన వాటికి రూ.15వేలు, క్రాస్‌బీడ్ రకానికి చెందిన వాటికి రూ.30వేల చొప్పున పాడిరైతులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా కింద నష్టపరిహారం అందించాల్సి ఉంది. అయితే, గత మూడేళ్లుగా బీమా చెల్లింపులకు బ్రేకులు పడ్డాయి. పాడిరైతులు ఎవర్ని అడిగినా ఆర్బీఐ పరిధిలో పెండింగ్‌లో ఉంది, త్వరలో చెల్లింపులు జరుగుతాయి అని చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2019 నుంచి 2021 మధ్యకాలంలో వైఎస్ఆర్ పశునష్టపరిహారం కింద జిల్లాలో 4,295 పశువులకు గాను రూ.12,11,88వేలు వరకు బీమా చెల్లించారు. 2021 తరువాత 4,393 పశువులకు గాను రూ.11,6,28వేలు పాడిరైతులకు చెల్లించాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సన్నాయినొక్కులు తప్ప చెల్లించడానికి మాత్రం ముందుకు రావడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పశు నష్టపరిహారం అందుతుందా, లేదా అని పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. టీడీపీ హయాంలో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు ఉచితంగా పశుబీమా పథకం వర్తింపజేసేవారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రైతుల నుంచి ప్రీమియం వసూలు చేస్తోంది. అయినప్పటికీ అరకొరగానే పశుబీమా నమోదు చేయడంతో పాటు పరిహారం కూడా సక్రమంగా చెల్లించడం లేదు. బియ్యం కార్డు లేని రైతులు సంకరజాతి పశువుకు రూ.960, దేశవాళీ పశువుకు రూ.480లు ప్రీమియం చెల్లించాలి. గొర్రెలు, మేకలకు సంబంధించి రూ.90 చొప్పున చెల్లించాలి. గరిష్ఠంగా ఒక కుటుంబానికి ఐదు పశువులకు, 50 చొప్పున గొర్రెలు, మేకలకు మాత్రమే ప్రీమియం చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ప్రీమియం వసూలు చేస్తున్నా.. మొక్కుబడిగా పశుబీమా చెల్లింపులు చేస్తున్నారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మృతిచెందిన ఆవు వద్ద రైతు మల్లేసు(ఫైల్)



నిధులు వచ్చిన వెంటనే జమ చేస్తాం

పశు బీమాకు సంబంధించి అన్ని క్లయిమ్‌లు ప్రోసెస్ చేశాం. అన్ని బిల్లులు పెట్టడం జరిగింది. ఆర్బీఐ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే పాడిరైతుల ఖాతాల్లో పరిహారం జమవుతుంది.

-డాక్టర్ కిషోర్, పశుసంవర్ధకశాఖ జేడీ

ఎచ్చెర్ల బీజేపీకే

- ఎన్డీయే కూటమి అభ్యర్థిగా ఎన్ఈఆర్
- ఎట్టకేలకు జాబితా విడుదల

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్)ను పార్టీ అధిష్ఠానం బుధవారం ఎంపిక చేసింది. పొత్తులో భాగంగా బీజేపీకి ఈ సీటును కేటాయించారు. ఎన్ఈఆర్ ప్రస్తుతం విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. గతంలో రణస్థలం టీడీపీ మండల అధ్యక్షుడిగా వ్యవహరించారు. అతని కుటుంబ సభ్యులు పదిహేనేళ్లుగా రాజకీయంలో చురుగ్గా ఉన్నారు. ఈశ్వరరావు తల్లి మహాలక్ష్మి గతంలో బంటుపల్లి సర్పంచ్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన సతీమణి రజిని బంటుపల్లి సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరక్టర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఇదిలా ఉండగా.. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. అయితే ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ పార్లమెంట్ నియోజకవర్గం మాత్రం విజయనగరం పరిధిలో ఉంది. ఇంకనూ విజయనగరం పార్లమెంట్‌కు మాత్రం ఎన్డీఏ కూటమి తరఫున అభ్యర్థిని ప్రకటించలేదు. వైసీపీ నుంచి ఎచ్చెర్ల అసెంబ్లీకి ప్రస్తుత ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మళ్లీ ఎన్నికల బరిలో ఉన్నారు.



అభ్యర్థి వివరాలు

పేరు : నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)
పుట్టిన తేదీ : 10-09-1970
విద్యార్హత: పోస్టు గ్యాడ్యుయేట్
స్వగ్రామం: నడుకుదిటిపాలెం, బంటుపల్లి పంచాయతీ, రణస్థలం

పెట్రోల్ బంక్‌పై బాంబు దాడి

- స్వల్పంగా పేలుడు
- మీటర్ బాక్స్ ధ్వంసం
- తప్పిన పెను ప్రమాదం

వజ్రపుకొత్తూరు, మార్చి 27: పూండి సమీపంలోని గునాలపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంట సమయంలో బాంబు దాడి జరిగింది. ఇద్దరు యువకులు బాంబు వేయడంతో స్వల్ప పేలుడు సంభవించింది. ఎస్ఐ సీహెచ్ రామారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇద్దరు యువకులు ముసుగులు వేసు కుని పెట్రోల్ మీటర్ బాక్స్‌ను ధ్వంసం చేశారు. దీనిని పగులగొట్టేందుకు చిన్న బాంబులను వినియోగించినట్లు గుర్తించామన్నారు. ఇవి దీపావళికి వినియోగించే లక్ష్మీ బాంబులా లేక మరే ఇతర బాంబులా అన్నది విచారణ చేపడుతున్నామన్నారు. ఈ ఘటనపై బంకు యజమాని కొర్ల దేవి మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంకు పరిసరాలను పరిశీలించామన్నారు. ఇందులో తమ బంధువుల హస్తం ఉండవచ్చన్న అనుమానాన్ని ఆమె వ్యక్తంచేశారని, ఆ దిశగా దర్యాప్తు చేపడుతున్నామని పేర్కొన్నారు. కాగా పెట్రోల్ బంక్‌పై బాంబు దాడి జరిగిన విషయం తెలుసుకున్న చుట్టుప్రక్కల వారు ఆందోళన చెందారు. బంకులో ఉన్న డీజిల్, పెట్రోల్‌కు మంటలు వ్యాపించి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని భయాందోళన వ్యక్తంచేశారు.



ధ్వంసమైన మీటర్ రీడింగ్ బాక్స్

చచ్చిపోతున్నా చలించరా?

- నిత్యం ఎలుగుబంట్ల దాడులు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- కానరాని నియంత్రణ చర్యలు
- భయంగొప్పిట్లో ఉద్దానం



మందసలో రోడ్డుపై నడిచి వెళ్తున్న ఎలుగుబంటి

- 2018 జూన్ 11న సోంపేట మండలం ఎర్రముక్కాం, మందస మండలం దున్నూరు పరిసరాల్లో ఎలుగుబంటి మారణకాండ సృష్టించింది. తోటలో ఉన్న దంపతులిద్దరిపై దాడిచేసి చంపేసింది. మరో ఏడుగురిని గాయపరచింది.
- ఈ ఏడాది మార్చి 23న ఇదే మండలం చీపురుపల్లి పంచాయతీ అనకాపల్లిలో ఎలుగుబంటి బీభత్సం సృష్టించింది. జీడితోటల్లో పనులకు వెళ్లిన రైతులపై దాడి చేసింది. ఇద్దరు రైతులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో మహిళ సావిత్రి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.
- 2022 జూన్ 19న వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి గ్రామానికి చెందిన కడమటి కోదండరావు ఎలుగు బంటి దాడిలో మృతి చెందాడు.
- 2022 జూన్ 20న వజ్రపుకొత్తూరులోని జీడి తోటలో పని చేస్తున్న ఆరుగురు వ్యక్తులపై ఎలుగు దాడి చేసి గాయపరిచింది. వీరిలో ఆర్మీ జవాన్ పురుషోత్తం ఉన్నారు. ఈ ఘటనలో అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి చెందారు.
- గతేడాది ఆగస్టులో ఇదే మండలం అక్కుపల్లిలో చొక్కల లోకనాథంపై భల్లూకం దాడి చేసింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన నెల రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సావిత్రి (ఫైల్)

వజ్రపుకొత్తూరు, మార్చి 27: ఉద్దానం ప్రాంతంలో ఎలుగుబంట్లు బీభత్సం సృష్టిస్తున్నాయి. నిత్యం ఏదోఒక చోట దాడులు చేస్తున్నాయి. ముఖ్యంగా వజ్రపుకొత్తూరు మండలంలో భల్లూకాలు విరుచుకుపడుతున్నాయి. ఈ మండలంలోనే వందకుపైగా ఎలుగుబంట్లు ఉన్నాయి. వీటి బారినపడి ఎందరో ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు క్షతగాత్రులుగా మారుతున్నారు. దీంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒకప్పుడు తీరప్రాంత గ్రామాల్లోని జీడి, మామిడి, కొబ్బరితోటల్లో ఎలుగుబంట్లు సంచరించేవి. ఇప్పుడు పొలాలు, పల్లపు ప్రాంతాల్లో కూడా సంచరిస్తున్నాయి. ఏదో ఒకచోట ఎలుగుబంట్లు కంట పడుతుండడంతో అవి ఎప్పుడు ఎలా దాడి చేస్తాయోమోనని ప్రజలు భీతిల్లుతున్నారు. ప్రస్తుతం జీడి, మామిడి పంటల సీజన్ కావడంతో తోటల్లో అవి మకాం వేసి దాడులు చేస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అటవీశాఖాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. తాము చచ్చిపోతున్నా చలించరా అని ప్రశ్నిస్తున్నారు. ఎలుగుబంట్లను సంరక్షణశాలకు పంపించేలా చర్యలు చేపడితే తమకు ఇటువంటి ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు.

మానవ తప్పిదమే కారణం?

గతంలో ఎప్పుడో ఒకసారి ప్రజలకు ఎలుగుబంట్లు కనిపించేవి. ప్రస్తుతం నిత్యం ఏదో ఒక చోట భల్లూకాలు దర్శనమిస్తున్నాయి. జీడి, మామిడి తోటల్లో ఎక్కువగా సంచరిస్తున్నాయి. కొన్నిసార్లు గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. దీనికి కారణం మానవ తప్పిదమనే విమర్శలు ఉన్నాయి. ఒకప్పుడు కొండలు, తీరప్రాంతాల్లో ఉండే సరుగుడు తోటలు ఎలుగుబంట్లకు నివాస కేంద్రాలుగా ఉండేవి. అయితే, కొందరు చోటా నాయకులు ఈ కొండలను తవ్వి ఆక్రమించుకుంటుండగా, తీరప్రాంతాల్లో ఉన్న సరుగుడు తోటలను కొంతమంది రైతులు నరికేసి విక్రయించేస్తున్నారు. అలాగే గ్రామాలకు సమీపంలో ఉండే జీడి, మామిడి, కొబ్బరి తోటలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా మార్చేస్తున్నారు. దీంతో భల్లూకాలకు స్థావరాలు కరువై ఆహారం కోసం గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. దీనికి తోడు కొమ్మ చెట్లకు పెడుతున్న మందులను ఎలుగుబంట్లు తినేస్తుండడంతో అవి పిచ్చిగా మారి మనుషులపై దాడికి పాల్పడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమ వుతోంది. కాగా, ఎలుగుబంట్ల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అటవీశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా రనే విమర్శలు ఉన్నాయి. అవి ప్రజలపై దాడి చేసిన సమయంలో హడావుడి చేసి ఆ తరువాత పట్టిం చుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలుగు బంట్లు గ్రామాలు, తోటల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామస్థులు అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు స్పందించి ఎలుగు బంట్లు గ్రామాలు, తోటల్లోకి రాకుండా నియంత్రించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.



ఎలుగు దాడిలో గాయపడిన ఆర్మీ జవాన్ పురుషోత్తం(ఫైల్)

అమ్మవారి ఆలయంలో భల్లూకం

పలాసరూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో తూర్పు వైపున ఉన్న జీడితోటల్లోని అమ్మవారి ఆలయం వద్ద బుధవారం ఎలుగుబంటి సేదతీరుతూ కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. జీడిపిక్కల సీజను కావడంతో రైతులు అధికంగా పిక్కలు ఏరుతూ తోటల్లోనే కాలం గడుపుతున్నారు. ఇటీవల కాలంలో ఎలుగుబంట్ల సంచారంతో జీడి తోటల్లోకి వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. ఇప్పటివరకూ వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో భల్లూకాల సంచారం అధికంగా ఉండేది. ప్రస్తుతం పలాస మండలంలో కూడా ఈ జాడ కనిపించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూకుమ్మడిగా జీడి తోటల్లోకి వెళ్లాలని, చేతిలో ఏమైనా ఆయుధాలు ఉంటేనే వెళ్లాలని రైతులకు



ఆలయంలో సేదతీరుతున్న ఎలుగుబంటి

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు
- లోహరిబంద గ్రామానికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక



పలాస: లోహరిబంద వైసీపీ కార్యకర్తలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్, గౌతు శిరీష

పలాస, మార్చి 27: రానున్నది టీడీపీ ప్రభుత్వమని ఎంపీ కింజ రాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాల యంలో మందస మండలం లోహరిబంద గ్రామానికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి ఎంపీ రామ్మోహన్ నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, దీనికి విసుగుచెంది అనేక మంది టీడీపీలో చేరడం పార్టీకి శుభ సూచకమన్నారు. సీఎం నుంచి ఎమ్మెల్యేల వరకు ప్రజలను, టీడీపీ నేతలను హింసించడం తప్ప అభివృద్ధి చేతకా లేదని రుజువైందన్నారు. జిల్లాలో అన్ని స్థానాల్లోనూ టీడీపీ విజయం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభంజనం సృష్టించ బోతోందని, తప్పులు చేసిన వైసీపీ నాయకులకు ప్రజలు తగు రీతిలో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఉమ్మడి పార్టీల అభ్యర్థి గౌతు శిరీష మాట్లాడుతూ.. తనకు టికెట్ ప్రకటించగానే సగం విజయం సాధించామని, ప్రజాదరణతో అధిక మెజార్టీ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో మందస పార్టీ నాయ కులు భావన దుర్యోధన, దాసరి తాతా రావు, బమ్మిడి కర్రయ్య, జీకే నాయుడు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గరుడుభద్ర నుంచి 20 కుటుంబాలు..

వజ్రపుకొత్తూరు: టీడీపీ అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పలాస అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. గరుడ భద్ర పంచాయతీ నుంచి 20 కుటుంబాలు వైసీపీని వీడి బుధవారం టీడీపీలో చేరాయి. వారికి శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపో తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ మోహన రావు, అర్సవెళ్లి ఉమామహేశ్వరరావు, బుల్లోజు శశిభూషణ్, కణితి సురేష్, పి.సాంబమూర్తి, కె.గణపతి, ఎంపీటీసీ చిట్టిబాబు, రెల్ల దానయ్య తదితరులు పాల్గొ న్నారు. ● పూండి, వజ్రపుకొత్తూరుల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా శిరీష ను, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించు కుంటామని క్లస్టర్ ఇన్‌చార్జిలు పుచ్చ ఈశ్వరరావు, కణితి సురేష్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.వసంతస్వామి, గోవింద పాపారావు, కర్ని రమణ తదిత రులు పాల్గొన్నారు. ● **హరిపురం:** మందస మండలం హరిపురం, మందస క్లస్టర్ టీడీపీ కార్యాలయాలను బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన ప్రారంభించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు డొంకూరు తిరుపతిరావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులను కలిసిన ఎంజీఆర్

మెళియాపుట్టి: మండలంలోని టీడీపీ సీనియర్ నాయకులను పాతపట్నం టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గొప్పిలి గ్రామంలో మాలతి డిల్లేశ్వరరావు, నారసం ధర్మారావు, పి.సాంబమూర్తి, సీహెచ్‌సాగర్, ప్రబల్ కుమార్ పాత్రో, కోట తిరుపతిరావు, కద్దాల కృష్ణమూర్తి, కొమిటి షణ్ముఖరావు, పల్లి కరుణాకర్‌తో పాటు జనసేన నాయకులు వాసు, శాసనపురి షన్ముఖరావు, తంగుడు వెంకట్రావులను కలిసి తన విజయానికి సహకరించాలని కోరారు.



నాయకులతో టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు

టీడీపీ విజయానికి సహకరించండి

టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీ నవరగోపాలపురం, అంజనాపురం గ్రామాల్లో బుధవారం ఇంటిం టికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రజలు ఆశీర్వదించాలన్నారు.● **టెక్కలి:** రాష్ట్రంలో టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని కోటబొ మ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. బుధవారం జగన్నాథపురం, బుజ్జిపేట, కంబాలపేట, పొడుగుపాడు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ● **సంతబొమ్మాళి:** టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలతో బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందనున్నా యని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. బుధవారం మండలంలోని ఆకాశ లక్కువరంలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: బగ్గు



కరకవలసలో మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు: టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నర సన్నపేట ఉమ్మడి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కరకవలస, కరకవలస కాలనీ, అన్నుపురం, శ్రీముఖలింగం గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. సైకో పాలనకు చమరగీతం పాడి రాష్ట్ర భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయా నికి సహకరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని ఆయన అభ్యర్థించారు.

నగిరికటకం వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక

నగిరికటకం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి రమణమూర్తి కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో నగిరికటకం గ్రామానికి చెందిన రావాడ జగన్మోహనరావు, పంచిరెడ్డి మురళీమోహన్, కుంచాల కోటేశ్వరరావు, బలగ పాపారావు, కుంచాల తిరుపతిరావు, గోవిందరావు, సతివాడ ధర్మారావు, చంద్రరావు, రాంబాబుతో పాటు పలు కుటుంబాలున్నాయి. కార్యక్రమాల్లో శ్రీముఖలింగం, కరకవలస సర్పంచ్‌లు టి.సతీష్‌కుమార్, గురుబెల్లి వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు తర్ర బలరాం, పి.దాలయ్య, దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై జెండా ఉంటే అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్వో రామ్మోహన్‌రావు

నరసన్నపేట: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఇంటిపై పార్టీల జెండాలను ఏర్పాటు చేస్తే అనుమతి తప్పనిసరని నరసన్నపేట నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ జీవీఎస్ రామ్మోహన్‌రావు అన్నారు. బుధవారం ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలన్నారు. వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఎంపీడీవోలకు సూచించారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



మానవహారం నిర్వహిస్తున్న మహిళలు, వెలుగు సిబ్బంది

మందస: ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎ.రఘుపతిరావు అన్నారు. మందసలో బుధవారం మండల మహిళా సమాఖ్య సంఘ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ చేపట్టారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని, దీనిని ప్రతి ఓటరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జి.ప్రసాదరావు, ఏవో బి.రుషేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన ర్యాలీ



నందిగాం-పూండి రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

నందిగాం: ఓటుహక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు బుధవారం ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. మండల కాంప్లెక్స్ ఆవరణలో ర్యాలీని తహసీల్దార్ వి.పద్మావతి, ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీవో జి.శివప్రసాద్ ప్రారంభించారు. ఈ ర్యాలీ నందిగాం, పెంటూరు, నరేంద్రపురం, నారాయణ పురం మీదుగా కణితివూరు వరకు ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ టి.రాజారావు, ఉపతహసీల్దార్ ఎన్.భాగ్యలక్ష్మి, వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న రెవెన్యూ అధికారులు

నందిగాం: మండలంలోని కాపుతెంబూరు మార్గంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని వాహనాన్ని సీజ్ చేశారు. బుధవారం టెక్కలి, నందిగాం సివిల్ సప్లై డీటీ కె.మురళీకృష్ణ, నందిగాం ఆర్‌ఐ పి.కిరణ్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించగా సోంపేటకు చెందిన సానా మనోహర్ 9 క్వింటాళ్ల 53 కిలోల బియ్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆయనపై 6ఏ కేసు నమోదు చేసి వాహనాన్ని నందిగాం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. తనిఖీల్లో వీఆర్వో పి.తారకేశ్వరరావు తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

పలాస, మార్చి 27: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తాళభద్ర యూపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ జీఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. 5వ వార్డులో ఉన్న ఈ పోలింగ్ కేంద్రం సమస్యాత్మక కేంద్రాల లిస్టులో ఉండడంతో ఆమె సందర్శించి అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. పాఠశాల చుట్టూ ప్రహరీ ఉండడంతో పోలింగ్‌కు ఇబ్బందులు ఉండవని సిబ్బంది ఆమెకు వివరించారు. డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** మండలంలోని అక్కుపల్లి, బైపల్లి పోలింగ్ బూత్‌లను బుధవారం ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. ప్రహరీ, మంచినీరు, విద్యుత్ సదుపాయం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మండలంలోని శివారు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వర్ రెడ్డి, ఎస్ఐ రామారావు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న ఎస్పీ రాధిక

ముమ్మరంగా తనిఖీలు

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలను ప్రత్యేక బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. డీటీ గాయత్రి ఆధ్వర్యంలో పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు మడపాం, జమ్ము జంక్షన్, తామరాపల్లి, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తీసుకువెళ్లితే సీజ్ చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి అన్నారు. మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు అన్నారు. బుధవారం జమ్ము గ్రామంలో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తామని, గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వా లన్నారు. మద్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



జమ్ములో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ఎన్నికలు వచ్చాయని..!



టెక్కలి కొండ్రవీధిలో కాలువ, అప్రోచ్ పనులు చేపడుతున్న దృశ్యం



పనుల కోసం ఏర్పాటు చేసిన కాంక్రీట్ మిక్సర్ తదితర పరికరాలు

టెక్కలి, మార్చి 27: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అధికారులు పలు అభివృద్ధి పనులు చేపడుతుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. టెక్కలి మేజర్ పంచాయతీ కొండ్రవీధి జంక్షన్‌లో రూ.4 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో కాలువ, అప్రోచ్ రోడ్డు పనులు చేపడుతున్నారు. ఇన్నాళ్లు గుర్తుకు రాని పనులు ఎన్నికల వేళ గుర్తుకు రావడంపై పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఈ పనులు పాత పనులే అని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నప్పటికీ పలు పార్టీల నుంచి విమర్శలొస్తున్నాయి. అధికార పార్టీ ఓట్ల కోసమే ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మండల ఇంజనీరింగ్ అధికారి లక్ష్మునాయుడు వద్ద ప్రస్తావించగా ఈ పని నెల రోజుల కిందటే ప్రారంభించామని, అయితే కాలువపై పలకలు ఇప్పుడు వేయడం వల్ల జాప్యం జరిగిందన్నారు. ఈ పనులైతే కొత్తగా మంజూరైనవి కావని, గ్రామ పంచాయతీకి సంబంధించి పాత నిధులతో చేపడుతున్నామన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

జలుమూరు: కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యమని డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మధుసూదనరావు అన్నారు. జలుమూరులో బుధవారం పార్టీ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి సమష్టి గా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలందరు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆర్.అప్పన్న, నియోజకవర్గ సమన్వయకర్త మామిడి సత్యనారాయణ, జలుమూరు, సారవకోట మండలాల పార్టీ అధ్యక్షులు భేరి వెంకటరమణ, లుకలాపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై విచారణ

పలాసరూరల్: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి 20వ వార్డుకు చెందిన ఉపాధ్యాయుడు మాధవ బెహరాపై డీఈవో ఆదేశాల మేరకు బుధవారం ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుడు పాల్గొన్నారనే విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో ఎంఈవో విచారణ చేపట్టారు. మాధవ బెహరా తల్లి ఇటీవల మృతి చెందగా వైసీపీ నాయకులు పరామర్శించేందుకు వచ్చారన్నారు. అదే సమయంలో వార్డులో పెద్ద మనుషులతో సమావేశం నిర్వహిస్తుండగా, తల్లి కర్మకాండలు నిర్వహించేందుకు ఉపాధ్యాయుడు అటు వైపు వెళ్తుండగా వైసీపీ నాయకులు ఫొటోలు తీసి హల్‌చల్ చేశారే తప్ప ఉపాధ్యాయుడికి, ప్రచారానికి ఎటువంటి సంబంధం లేదని విచారణలో తేలిందని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

కోడ్ ఉల్లంఘించిన టీచర్‌పై..

జలుమూరు (సారవకోట): మూగుపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చౌదరి లక్ష్మీనారాయణ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నివేదిక అందించాలని నరసన్నపేట ఆర్వో జీవీఎస్ రామ్మోహన్‌రావు సారవకోట ఎంపీడీవో రాంబాబును ఆదేశించారు. సోషల్ మీడియాలో గిరిజన ఐక్యవేదిక తరఫున సదరు ఉపాధ్యాయుడు ఎన్నికల ప్రచారం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. విచారణ నివేదిక మేరకు తదుపరి చర్యలుంటాయని ఆర్వో రామ్మోహన్‌రావు తెలిపారు.

దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ శిబిరం

నరసన్నపేట: స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం దివ్యాంగుల పిల్లలకు ఉపకరణాల నిమిత్తం నిర్ధారణ శిబిరం నిర్వహించారు. నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన 18 ఏళ్ల లోపు ఉన్న 115 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో హాజరయ్యారు. దివ్యాంగులకు పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో డా.రెడ్డి భార్గవ్, డా.బి.రాజేంద్రప్రసాద్, మేరి ఇందిరా, ఎస్ఎస్ఏ ఏఎంవో గుంట లక్ష్మీనారాయణ, ఎంఈవో పి.దాలినాయుడు, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు టెక్కలిలో..

టెక్కలి: స్థానిక భవిత కేంద్రం ఆవరణలో బుధవారం ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ చిన్నారు లకు, బాలలకు ఉపకరణాల పంపిణీ నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు తులసీరావు, చిన్నారావు తెలిపారు. టెక్కలి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాలకు చెందిన దివ్యాంగ చిన్నారులు సదరం ధ్రువీకరణ పత్రంతో పాటు రెండు ఫొటోలు తీసుకొని హాజరు కావాలని వారు కోరారు.

జై భారత్ పార్టీ టెక్కలి కో-ఆర్డినేటర్‌గా పరమేశ్వరరావు



సంతబొమ్మాళి: జై భారత్ నేషనల్ పార్టీ టెక్కలి నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా మేఘవరం పంచాయతీ సూరాడవానిపేటకు చెందిన బైపల్లి పరమేశ్వరరావు నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధినేత లక్ష్మీనారాయణ, ఉత్తరాంధ్ర కన్వీనర్ ఇంజరపు జయదేవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు



టెక్కలి: కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లఖినేని శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బమ్మిడి నారాయణరావు, కార్యదర్శిగా ఉప్పాడ తిరుమలరావు, సహాయ కార్యదర్శిగా కృష్ణపాత్రుని వెంకట్రావు, కోశాధికారిగా బమ్మిడి ధర్మారావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది వెలమల అప్పలనాయుడు వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు ఐదోసారి ఎన్నికయ్యారు.

రేపటి నుంచి దుర్గాగిరి అమ్మవారి జాతర

దీర్ఘాశి(పోలాకి): దీర్ఘాశి దుర్గాగిరి భవానీ అమ్మవారి జాతర శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. జాతర నిర్వహణకు సర్పంచ్ ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా మూడు రోజుల జాతర సజావుగా నిర్వహించనున్నామన్నారు. నిర్వాహకులు ఎం.కృష్ణారావు, పాగోటి తాతబాబు, శ్రీనివాసరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు

నందిగాం/ఎల్ఎన్‌పేట: పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. నందిగాం మండలంలో నాలుగు, ఎల్ఎన్ పేట మండలంలో రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఊపిరి పీల్చుకుని ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.

సేవా దృక్పథంతో వైద్య సేవలందించాలి: మంత్రి

- సాయిశ్రీనివాస మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, చిత్రంలో ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులు బాలకృష్ణ, జోత్స్న



ఆధునిక విభాగాలను ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు, గౌతు శిరీష

పలాస, మార్చి 27: అన్ని వర్గాల ప్రజలకు సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని మంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. చిన్నబడాం రోడ్డులో నూతనంగా నిర్మించిన సాయిశ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నమ్మకమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. 18 ఏళ్లుగా వైద్య సేవలందిస్తూ ప్రజల ప్రశంసలు పొందిన వైద్యులు టి.బాలకృష్ణ, ఎంపీ జ్యోత్స్న దంపతులను అభినందించారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఆధునిక పరికరాలతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రిలోని ప్రత్యేక విభాగాలను ఎంపీ ప్రారంభించారు. 24 గంటల పాటు వైద్యం అందించడం సాధారణ విషయం కాదని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ.. పేదలకు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించి గుర్తింపు పొందాలని కోరారు. ఆసుపత్రి వైద్యాధికారులు టి.బాలకృష్ణ, జ్యోత్స్న మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లకుండా ఇక్కడే మంచి వైద్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుల తల్లిదండ్రులు టి.మల్లేశ్వరరావు, కృష్ణకుమారి, వైద్యాధికారులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పిక్కాడిస్తున్నారు!

● జాతర్లు, సంబరాలు, పండగల ప్రాంతాలే నిర్వాహక స్థలాలు
● కానరాని పోలీసుల పర్యవేక్షణ.. జోరుగా పిక్కాటపై బెట్టింగ్‌లు

శ్రీకాకుళం క్రైం: మొన్న పేకాట.. నిన్న క్రికెట్.. నేడు పిక్కాట కాదేది బెట్టింగ్‌లకు అనర్హం. పేకాటలో కొందరు డబ్బులు వాటాలు పెట్టి ఆడించేందుకు కాపలాదారులకు కొంత మొత్తం చెల్లించి శివారు ప్రాంతాల్లో పేకాట శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇక క్రికెట్ బెట్టింగ్ విషయంలో బంతి బంతికి బెట్టింగ్ వేస్తూ కోట్లలో లాభాలు గడిస్తున్నారు. సాంకేతికత పెరిగిపోవడం ఫోన్ కాల్ ట్రేసింగ్ ద్వారా పోలీసుల దాడులు, కేసులు పెరిగిపోయి బుకీలకు తలనొప్పిగా మారింది. దీంతో జిల్లాలో ఓ బ్యాచ్ పాత పద్ధతినే కొత్తగా జనాల్లోకి తీసుకుని వచ్చి అడ్డొచ్చిన వారిని మేనేజ్ చేస్తూ ప్రతీ రోజు రూ.లక్షలు ఆర్జిస్తున్నా రు. పూర్వం గ్రామాల్లో విచ్చలవిడిగా ఈ పిక్కాట పందాలు జరిగేవి. ఈ ఆటలో కొంత మంది సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ ఉదంతాలు ఉన్నాయి. పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేయడంతో పిక్కాట మరుగున పడిపోయింది. అయితే ఇప్పుడు గ్రామాల్లో సంబరాలు, అమ్మవారి పండుగలు, జాతర్లు జరిగితే చాలు అక్కడ ఈ పిక్కాట ప్రత్యక్షమవుతుంది. ఒకప్పుడు పేకాట ఆడుకునే కొన్ని బ్యాచ్‌లు ఈ పిక్కాటను ఎంచుకుని జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తున్నారు.

జిల్లాలో గార మండలం వత్సవలసలో గత నెల నుంచి జరుగుతున్న జాతరలో పిక్కాట ఆడించారు. శనివారం, ఆదివారం ఇలా వారంలో రెండు రోజుల పాటు జరిగే జాతరలో పిక్కాట ముఠా రెచ్చిపోయి మరీ ఆడించారు. ఈ విషయం కాస్తా పోలీసు ఉన్నతాధికారులకు తెలియడంతో దాడులు చేయించారు.


కోటబొమ్మాళి పరిసరాల్లో పిక్కాట ఆడుతున్న దృశ్యం

అప్పటికే సమాచారం అందుకున్న పిక్కాట బ్యాచ్ మకాం మార్చేశారు. దీంతో మకాం కాస్తా కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామానికి మార్చేశారు. అక్కడ కూడా పండుగులకు గాను సోమవారం రాత్రి వరకు పిక్కాట నిర్వహించారు. ఒప్పంగి గ్రామంలో పండుగలు కావడంతో మంగళవారం, బుధవారం నిర్వహించేందుకు మంతనాలు జరిపినా ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రాంతంలో పోలీసు బందోబస్తు ముమ్మరంగా ఉండడంతో కుదరలేదు. అయితే బుధవారం వప్పంగి తోటలో పెద్ద ఎత్తున పిక్కాటలు నిర్వహించారు. రూరల్ మండలంలోని వమరవిల్లి, కొమరాడపేట ప్రాంతాల్లో ఈ పిక్కాటలు జోరుగా సాగుతున్నాయి. అలాగే నరసన్నపేట, పోలాకి, పిస్నింటిపేట గ్రామాల్లో కూడా తరుచూ ఈ పిక్కాటలు ఆడిస్తున్నారు.

నిఘా పెట్టాం..

గార మండలంలో పిక్కాట నిర్వహిస్తున్నట్టు సమాచారం ఉందని, వత్సవలసలో జరుగుతుందని తెలిసి ఆకస్మిక దాడులు చేపట్టారు. ప్రస్తుతం మా మండలంలో జరగడం లేదు. శ్రీకూర్మం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిర్వహిస్తున్నట్టు గుర్తించాం. అతనిపై పిక్కాట(డొక్కాట) నిర్వహిస్తున్న కేసులు కూడా ఉన్నాయి. ఇటువంటివి జరుగుతున్నట్టు తెలిస్తే ప్రజలు డయల్ 100 లేదా 63099 90846 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వండి.

- కె.కృష్ణప్రసాద్, ఎస్ఐ, గార

వ్యక్తి ఆత్మహత్య

లావేరు: బెజ్జిపురానికి చెందిన కింతలి క్రాంతికుమార్ (35) బుధవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. క్రాంతికుమార్‌కు పదేళ్ల కిందట రాజాం మండలం సోపేరు గ్రామానికి చెందిన దాసరి వసుంధరతో వివాహం అయింది. కొన్నాళ్లుగా వీరిమధ్య మనస్పర్థలు రావడంతో ఒకరికొకరు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో కోర్టులో నడుస్తుంది. కాగా క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకునే ముందు తన భార్యపై ఆరోపిస్తూ ఓ వీడియో తీసి సోషల్ మీడియలో పోస్టు చేశాడు. తన చావుకు భార్య వసుంధర, అత్త గున్నమ్మ, మామ సూరిబాబు, బావమరుదులు సాయి, దిలీప్, తాత తవుడులతో పాటు బెజ్జిపురానికి చెందిన మరికొంత మంది వ్యక్తులు నాపై తప్పుడు కేసులు పెట్టి మానసికంగా ఇబ్బందులు గురి చేస్తుండడంతో మస్తాపనికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్టు తెలిపారు. తన చావుకు కారకులైన అందరిపై చర్యలు తీసుకోవాలని వీడియో ద్వారా పోలీసులను వేడుకున్నాడు. క్రాంతికుమార్ తండ్రి చిన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్ స్వామినాయుడు తెలిపారు. కాగా వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యం సీసాలతో కారు సీజ్

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ కారులో మద్యం సీసాలు తరలిస్తున్న ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం సీసాలతో కారును సీజ్ చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి చింతాడ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో మూడు ఆర్మీ ఫుల్ బాటిల్స్, మూడు బీర్లతో సింగుపురం రోడ్‌లోకి రావడంతో వారిపై అనుమానంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎక్సైజ్, పోలీసు బృందం వారిని వెంబడించి పట్టుకున్నారు. కారులో మద్యం బాటిల్స్ ఉన్నట్టు గుర్తించిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం కారును రూరల్ పోలీసులకు అప్పగించగా, ఎస్ఐ వాసు కారు సీజ్ చేసి ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

వైభవంగా మదీనా బాబా చందనోత్సవం

గార: కళింగపట్నంలో ప్రసిద్ధ మదీనా బాబా దర్గాలో బుధవారం చందనోత్సవం (ఉర్సు) వైభవంగా జరిగింది. ఉదయం బాబా వారి సమాధి శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొత్త చందనం పూతపూసి నూతన వస్త్రాలు సమాధిపై కప్పారు. తర్వాత ఖురాన్ పఠనం చేశారు. వేలాదిమంది భక్తులకు బాబా వారి అన్న ప్రసాదాన్ని పంచిపెట్టారు. సాయంత్రం చాదర్ ఊరేగింపు చేసి బాబా వారి సమాధిపై కప్పారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఖవాలీ ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ముస్లింలు, హిందువులు పాల్గొన్నారు.


అలంకరణలో మదీనా బాబా సమాధి

మిమిక్రీ కళాకారుడికి సత్కారం


నందికేశవరావును సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ రంగస్థలం దినోత్సవ సందర్భంగా శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో సీనియర్ జాతీయ మిమిక్రీ కళాకారులు లోకనాథం నందికేశ్వరరావుకి ఘనంగా సన్మానించారు. సభాధ్యక్షుడిగా సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు, ముఖ్యఅతిథిగా శ్రీశయన కార్పొరేషన్ అధ్యక్షుడు దండి పంకజాక్షర దేవ్, సమాఖ్య గౌరవ అధ్యక్షులు లోకనాథం రామలింగస్వామి, డాక్టర్ గుంపా శివప్రసాద్, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు ప్రసంగిస్తూ.. కళారంగంలో నందికేశ్వరరావు మిమిక్రీ కళాకారుడిగా జాతీయ స్థాయిలో ఉన్న కీర్తి ప్రతిష్ఠలు సన్మానాలు గుర్తు చేసుకున్నారు. ఇంటి ముంగిట సన్మానం అన్న పేరుతో ఏటా వివిధ కళారంగాల్లో నిష్ణాతులైనవారిని ప్రపంచ రంగస్థల దినోత్సవ సందర్భంగా సన్మానం చేయడం ఆనవాయితీగా వస్తుందని, ఈ ఏడాది నందికేశవరావుని సత్కరించామని నిర్వాహకులు తెలిపారు. కేశవరావు, బి.రామచంద్రదేవ్, కలగ గణేష్ యాదవ్, పొట్నూరు వెంకటరావు, నిక్కు అప్పన్న, నిక్కు హరి సత్యనారాయణ, ఇంజరాపు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి బ్యాగ్ అప్పగింత

శ్రీకాకుళం క్రైం: నగరానికి ఓ వ్యక్తి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి విశాఖ వెళ్లేందుకు గాంధీ పార్క్ వద్ద ఆటో ఎక్కాడు. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుని తమతో తెచ్చుకున్న బ్యాగ్‌ను ఆటోలోనే వదిలేశారు. అయితే ఆ రోజు ఆటోడ్రైవర్ పి.రామారావు సింగుపురం సమీపంలోని కృష్ణప్పపేటలో తన ఇంటికి వెళ్లి చూసేసరికి ఆటోలో బ్యాగ్ కనిపించింది. తిరిగి తాను వచ్చిన దారిలో వెళ్లి బాధితునికి ఇద్దామని వ్యతికినా ఫలితం లేకపోయింది. ఆ బ్యాగ్‌ను తన వద్దే భద్రంగా ఉంచాడు. అయితే బ్యాగ్ పోగొట్టుకున్న ఆ వ్యక్తి టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాల ఆధారంగా రామారావును గుర్తించారు. దీంతో బుధవారం టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు సమక్షంలో రామారావు ఆ బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించారు. ప్రయాణికులు తమతో తెచ్చుకున్న వస్తువులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్


తనిఖీ నిర్వహిస్తున్న కలెక్టర్, తదితరులు

కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని ఈవీఎంల గోదాములను రాజకీయ పార్టీల నాయకులతో కలిసి కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. గోదాములను తెరిపించి, నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బ్లాకులను, ఈవీఎంలను పరిశీలించారు. గోదాముల్లోని సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. అనంతరం మళ్లీ గోదాములకు సీళ్లు వేయించారు. అక్కడే సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. ఈవీఎంల తొలిదశ తనిఖీకి ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘానికి ఈ తనిఖీల సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, నోడల్ అధికారి సుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పీఎంజే బాబు (టీడీపీ), రౌతు శంకరరావు (వైసీపీ), సురేష్‌సింగ్ బాబు (బీజేపీ), రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల లీకులు.. తాగు నీరు వృథా



కంచిలి: మఠం సరియాపల్లి నుంచి బెల్లుపడ గ్రామాలకు జల్‌జీవన్ మిషన్, ఉద్దానం పథకం ద్వారా వెళ్లే పైపులైన్లు నారాయణబట్టి, అరవ సరియాపల్లి జంక్షన్ వద్ద లీకులమయ మ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లాల్సిన నీరు వృథాగా పోతోంది. తక్షణమే అధికారులు స్పందించి పైపులైన్ల లీకులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రామ మందిర నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గ్రామస్థులు

సరుబుజ్జిలి: మూలసవలాపురం పంచాయతీ వ్యాసుల పేటలో శ్రీరామమందిర నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో ఇప్పటివరకు ఎటు వంటి ఆలయాలు లేకపోవడంతో పరిసర గ్రామాల్లో ఉన్న వివిధ ఆలయాలకు ప్రజలు వెళ్లి పూజలు చేసుకుంటున్నారు. దీంతో గ్రామస్థులు దాతల సాయంతో శ్రీరాముని మందిర నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు.ఈ మేరకుఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా కోన జగన్నాథంమాస్టార్‌ను ఎన్నుకున్నారు.

సొంత చెల్లెళ్లను పట్టించుకోని జగన్‌రెడ్డి రాష్ట్రానికి ఏమి ఉద్ధరిస్తాడు: ఎంపీ


మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు, రవికుమార్

పొందూరు: సొంత చెల్లెళ్లను పట్టించుకోని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఏమి ఉద్ధరిస్తాడని శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో జరిగిన శుభ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి నోరు విప్పితే నా అక్క, చెల్లమ్మలు అని అంటారు కాని సొంత కుటుంబసభ్యులనే రోడ్డున పడేసిన ఘనుడని అన్నారు. తన తండ్రి హత్యకేసుపై మాట్లాడిన చెల్లెలు సునీత, జగన్ విడిచిన బాణమని చెప్పుకున్న వైఎస్ షర్మిళ జగన్‌రెడ్డిని విమర్శించి, నిలదీస్తే సమాధానం ఇవ్వలేని వ్యక్తి జగన్ రెడ్డని విమర్శించారు. సొంత చెల్లెళ్లే నమ్మని జగన్‌రెడ్డిని రాష్ట్రంలో ఏ మహిళ నమ్ముతుందన్నారు. జగన్‌రెడ్డి మాయ మాటలు నమ్మేస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. పార్టీ నాయకులు సీహెచ్ రామ్మోహన్, బి.శంకర భాస్కర్, అనకాపల్లి విజయలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, ఎ.చినరంగ, బాడాన గిరి, ఎ.వాణి, బి.హారిక, ఎస్.శ్రీరంగ, ఎ.గోపి, తదితరులు ఉన్నారు.

జగన్‌కు ఓటమి భయం

● విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల టీడీపీ కోఆర్డినేటర్ పీఎస్‌రెడ్డి


సరుబుజ్జిలి: ప్రచారం చేస్తున్న శ్రీనివాసరెడ్డి

సరుబుజ్జిలి: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో సైకో సీఎం జగన్మోహన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని టీడీపీ విజయనగరం, శ్రీకా కుళం జిల్లాల కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని షలంత్రిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికు మార్ శంఖారావం ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిన్నటి వరకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ వైనాట్ 175 అన్న జగన్ రెడ్డి ఎన్‌డీఏ కూటమి దెబ్బకు తాడేపల్లి ప్యాలెస్ వదిలి బస్సు యాత్రతో ప్రజలను మభ్యపెట్టడానికి బయలుదేరారన్నారు. కార్యక్రమంలో బీజేపీ, జనసేన కన్వీనర్లు పేడాడ సూరపునాయుడు, పేడాడ రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, నాయకులు కిల్లి సిద్దార్థ, లావేటి పూర్ణారావు, నందివాడ గోవిందరావు, తాడేల రాజారావు తదితరులు పాలొన్నారు.

దుర్మార్గ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న గొండు శంకర్

గార: దుర్మార్గ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఉదయం కళింగపట్నంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని, ప్రధానిగా నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టీడీపీ నాయకులు పీస వెంకటరమణ మూర్తి, బడగల వెంకట అప్పారావు, తాళ్లూరి శివనర్సింహ ప్రసాద్, గొండు భాస్కర్. ఈజీవీ రమణమూర్తి, కె.జగదీష్, కె.శ్రీధర్ రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు బీసీల పక్షపాతి

అరసవల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు బీసీల పక్షపాతి అని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో బీసీల ఆత్మీక కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తామన్నారు. తాను ఓ సామాన్య కార్యకర్తనని, పార్టీ పట్ల తనకు గల చిత్తశుద్ధి, ప్రజా సమస్యలపై పోరాడే తీరును చూసి తనకు ఈ అవకాశం ఇచ్చారన్నారు. నీలి మీడియా తప్పుడు ప్రచారం చేసి టీడీపీ కుటుంబంలో చిచ్చు పెట్టాలని చూస్తోందన్నారు. ఇటువంటి రాతలను నమ్మవద్దని టీడీపీ నాయకులను, కార్యకర్తలను అభిమానులను కోరారు. ఈ సందర్భంగా బీసీ డిక్లరేషన్‌లోని 10 అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీకి నష్టం వాటిల్లకుండా మాట్లాడాలి

అరసవల్లి: పార్టీ అధిష్ఠానం నిర్ణయం తెలియజేసేంత వరకు సంయమనం పాటించాలని, పార్టీకి నష్టం వాటిల్లకుండా ప్రవర్తించాలని శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. అరసవల్లిలో గల మాజీ మంత్రి గుండ దంపతులు నివాసంలో బుధవారం వారు సమావేశమై మాట్లాడారు. టీడీపీ శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి విషయంలో మళ్లీ ఐవీఆర్ఎస్ సర్వే చేయడం కూన రవికుమార్ చొరవతో జరిగిందని, ఈ విషయంలో మిగతా చర్యలు కూడా పూర్తి చేస్తే నియోజకవర్గ నాయకులు, ప్రజలు సంతోషపడతారన్నారు.

ఎన్నికల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

కలెక్టరేట్: ఎన్నికల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి బుధవారం సీ-విజిల్ యాప్, ఈఎస్ఎంఎస్ ఫిర్యాదులు, ఎంసీసీ, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-7, 8 పరిష్కారం, రాజకీయ పార్టీలకు అనుమతుల జారీ, సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను పటిష్ఠంగా అమలుపరచడం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంకే మీనా మాట్లాడుతూ.. నేరుగా గానీ, పోర్టల్ ద్వారా గానీ అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులను మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లా నుంచి కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్వోలు భరత్ నాయక్, దొర, సీహెచ్ రంగయ్య, లక్ష్మణమూర్తి, అప్పారావు, రామ్మోహన్, డీఆర్వో ఎం.గణపతిరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

కలెక్టరేట్: ఎన్నికల ప్రచారాల కోసం ఆయా రాజకీయ పార్టీలు/అభ్యర్థులు ముందస్తు అనుమతులు తీసుకోవాల్సిందేనని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రచారాలు, ఇతర అనుమతులకు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్ద నుంచి అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా ప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకుల ర్యాలీలు, రోడ్ షోలు వంటి కార్యక్రమాల కోసం 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలని, డోర్ టు డోర్ ప్రచారానికి కూడా అనుమతి ఉండాలన్నారు. జిల్లాలోని 2,357 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ కోసం బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల నామినేషన్ వరకు ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఇకపై ఓటర్ల జాబితాలో తొలగింపులు ఉండబోవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పీఎంజే బాబు (టీడీపీ) రౌతు శంకరరావు (వైసీపీ), సురేష్‌సింగ్ బాబు(బీజేపీ), మల్లిబాబు (కాంగ్రెస్), రట్టి ప్రకాశరావు(సీపీఎం), ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఈశ్వరరావు


అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న న్యాయవాదులు

గుజరాతీపేట: జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిలారి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. త్రిముఖ పోటీ హోరాహోరీగా జరగగా ఈశ్వరరావు 63 ఓట్ల తేడాతో విజయం సాధించారు. జిల్లా కోర్టు సముదాయంలో బుధవారం పోలింగ్ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సాగింది. బార్ సభ్యులు 608 ఓట్లకు గాను 493 మంది ఓటును వినియోగించుకున్నారు. ఇందులో రెండు ఓట్లు ఇన్‌వాలీడ్‌గా ప్రకటించారు. అధ్యక్షుడి స్థానానికి ముగ్గురు సీనియర్ న్యాయవాదులు కిలారి ఈశ్వరరావు, కూన రాజారావు, ఎన్ని సూర్యారావు పోటీపడగా అత్యధిక ఓట్లతో ఈశ్వరరావు విజయం సాధించారు. అదేవిధంగా జాయింట్ సెక్రటరీ కోసం ఇద్దరు పోటీపడగా పీస చంద్రశేఖర్ గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా మరిచెర్ల అన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా యగల్ల ప్రసన్నకుమార్, ట్రెజరర్‌గా విరోధి శ్రీనివాసరావు, లైబ్రరీ సెక్రటరీగా పాతినవలస రామారావు, స్పోర్ట్స్ సెక్రటరీగా కారి అప్పారావు, లేడీ రిప్రజెంటేటివ్‌గా దవళ అమృత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా న్యాయవాదులు కంచరాన నాగభూషణరావు, సహాయ ఎన్నికల అధికారులుగా ఆరికతోట కృష్ణంరాజు, మజ్జి సంపత్‌కుమార్, టీఎస్ శ్రీనివాసరావు, పీస జయరాం, అరంగి అప్పలరాజు, అసదుల్లా తదితరులు వ్యవహరించారు.

యర్రముక్కాం పాఠశాలను సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

సోంపేట: యర్రముక్కాం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సాయంత్రం వార్షికోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీసుకున్న ఆహారం వల్ల పది మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలతో అనారోగ్యం పాలయ్యారు. దీంతో వీరిని తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించి వైద్యసేవలందించారు. ఎంఈవో ఎస్.జోరాడు బుధవారం పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడారు.

రెజ్లింగ్ పోటీల్లో శివచరణ్ ప్రతిభ

ఎచ్చెర్ల: స్థానిక శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండో సంవత్సరం చదువుతున్న యండ శివచరణ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని రజిత పతకాన్ని సాధించారు. చిత్తూరులో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన పోటీల్లో 72 కిలో విభాగంలో పాల్గొని ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.

ఓటును వినియోగించుకోండి: జేసీ

పొందూరు: ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన ఓటు అనే ఆయుధాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జేసీ, ఆమదాలవలస ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ తెలిపారు. బుధవారం పొందూరులో ఓటు ప్రాధాన్య తను ప్రజలకు వివరించేందుకు 2కె రన్ నిర్వహించారు. ప్రభుత్వోన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు 2కె రన్ నిర్వహించి అనంతరం అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.కిరణ్‌పాల్, ఎంపీ డీవో సీహెచ్ సూర్యనారాయణ, ఎంఈవోలు రామరాజు, రాజారావు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రా యుధమని వైఎస్ఆర్ క్రాంతిపథం అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. వయోజనులంతా ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాని సూచించారు. బుధవారం స్థానిక కొర్లకోట, హనుమంతుపురంల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ, వీవోఏలు వనజాక్షి, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం: ఓటు వజ్రాయుధమని ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు. బుధవారం సన్యాసిపుట్టుగ, బొడ్డబడల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మహిళా సంఘాలతో ర్యాలీ నిర్వహించారు.


పొందూరు: 2కే రన్‌ను ప్రారంభిస్తున్న జేసీ నవీన్



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కంచిలి: 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు శుక్రవారం నుంచి మే 22లోగా ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 9985975684, 83744 83269 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో...

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం ఏపీమోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో టెన్త్ పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేడు జాబ్‌మేళా

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేబిన్ కుమార్ పాడి ఒక ప్రకటనలో తెలిపారు. డక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీ ఫార్మసీ విభాగానికి చెందిన వారు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ఎంఎస్సీ, బీఎస్సీ విద్యార్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు డిగ్రీ కళాశాలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9966586725 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.

నివేదికలు బహిర్గతం చేయాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో చేపట్టిన నియామకాలు, అవకతవకలపై విచారణకు నియమించిన కమిటీల నివేదికలు బహిర్గతం చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం రిజిస్ట్రార్ పి.సుజాతను కలిసి వినతి పత్రం అందజేశారు. వర్సిటీలో అంతర్గతంగా వేసిన మూడు కమిటీల నివేదికల ఆధారంగా చర్యలు చేపట్టాలన్నారు. పూర్వపు వీసీ హయాంలో నియమించిన 34 మందిని తక్షణమే తొలగించాలని ఆ వినతి పత్రంలో డిమాండ్ చేశారు. ఈ అంశాలపై నెల రోజుల్లోగా చర్యలు చేపట్టకపోతే వర్సిటీ ఎదుట మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, వర్సిటీలో అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ తదితరులు ఉన్నారు.

రక్తదాతలు స్ఫూర్తిదాతలు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో రక్తం కొరత ఉన్న తరుణంలో తమ అభిమాన సినీ నటుడు రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా అందరికీ స్ఫూర్తినిచ్చేలా అభిమానులు రక్తదానం చేయడం అభినందనీయమని డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. రామ్‌చరణ్ జిల్లా యువశక్తి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించారు. ఎస్‌వీసీలో మగధీర ప్రత్యేక షో సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం లయన్స్ బ్లడ్ బ్యాంకులో సుమారు 27 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో యువశక్తి అధ్యక్షుడు రావాడ కామేష్, జనసేన పార్టీ నాయకులు కె.ఉదయ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కళలను బతికించండి

ఆమదాలవలస: అంతరించిపోతున్న కళలను బతికించాలని సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జేజే మోహన్‌రావు కోరారు. బుధవారం ఆమదాలవలసలో కళాకారుల సంఘ అధ్యక్షుడు టేకు త్రినాధరావు ఆధ్వర్యంలో ప్రపంచకళాకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌరాణిక కళలు, రంగస్థల కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం శశిరేఖ పరిణయం, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి బగాది వెంకటరావు, బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తిశర్మ, బుడుమూరు శ్రీనివాసరావు, రామారావు, సిటి జన్‌ఫోరం సంఘ ప్రతినిధులు బొడ్డేపల్లి మోహన్‌రావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

శ్రీకాకుళం క్రైం: నగర శివారు ప్రాంతంలో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాత్రి గస్తీని పరిశీంచడంలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి పోలీసు బీట్లను సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శివారు ప్రాంతాల్లో రైస్ మిల్లులు, దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటపుడు సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పండుగలు జరుగుతున్న తరుణంలో గస్తీలు ముమ్మరం చేయాలని తెలిపారు. రైస్ మిల్లుల్లో రాత్రి పూట నగదు ఉంచరాదని సీఐ సూచించారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు వైద్యశిబిరం

కంచిలి: కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేకావసరాల పిల్లలకు బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, మందస, పలాస మండలాలకు చెందిన 200మందికి పరీక్షలు చేశారు. వీరిలో 69 మందికి ట్రైసైకిళ్లు, 39 మందికి వీల్‌చైర్లు పంపిణీ చేసినట్లు భవిత కేంద్రం ఉపాధ్యాయులు, సహాయకులు చంద్రశేఖర్, నిర్మల తెలిపారు. కార్యక్రమంలో సహిత విద్యా సహాయ కో ఆర్డినేటర్ ఉమాదేవి, కంచిలి తహసీల్దార్ ఎంవీకేఎస్ రవి, ఎంఈవో శివరాంప్రసాద్, చిట్టిబాబు, ఏఎస్‌వో శ్రీనివాసరావు, హెచ్ఎం సీతారాం, వైద్యులు పి.దేవేంద్రరెడ్డి, భార్గవి, చిన్నంనాయుడు, శ్రీధర్ పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో జేసీ కుటుంబ సభ్యులు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని బుధవారం ఉదయం జాయింట్ కలెక్టర్ నవీన్ తల్లితండ్రులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనం అందచేశారు. స్వామి వారి ప్రసాదాన్ని చిత్రపటాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు వారికి అందచేశారు. వీఆర్వో జగదీష్, తదితర అధికారులు పాల్గొన్నారు.


ఆశీర్వదిస్తున్న ప్రధాన అర్చకులు